



# ముడి విప్పని మిస్టరీ

ఉలిక్కిపడి లేచింది సరోజ. ఏదో కాలుతున్న వాసన. 'మళ్ళీ నీళ్ళ మోటర్ బర్న్ అయిపోయింది కాబోలు!' అనుకొంటూ, కళ్ళు నలుముకొంటూ మంచం దిగింది. 'నిత్యం ఉండే భాగోతమే ఇది, వెధవ మోటార్ ఎప్పుడూ కాలిపోవడమే!' విసుక్కొంటూ పెరట్లోకి నడిచింది.

పెరట్లోంచి మోటార్ నడుస్తున్న చప్పుడు స్పష్టంగా వినిపిస్తూనే ఉంది. సరోజ ఆశ్చర్యపోయింది. నిక్షేపంగా నడుస్తున్న మోటార్ నుంచి కాలుతున్న వాసనేమిటి అనుకొంటూ, దగ్గరగా వెళ్ళి స్విచ్ ఆఫ్ చేసింది. 'ఇంకా నయం, మోటార్ పూర్తిగా కాలిపోకముందే

మెలుకువ వచ్చేసింది! అయినా ఈయనొకరూ... ఫస్ట్‌షిఫ్ట్‌కు వెడుతూ ఈ మోటర్ ఆన్ చేసి పోతారు. వద్దంటే వినరు....'

ఇంకా నిద్దరమత్తు పూర్తిగా దిగలేదు సరోజకు. పెరట్లోంచి వెనక్కు వస్తూ సరోజ తమ ఇంటి మేడమీద వాటాకేసి చూసింది. పై వాటాలో ఉండే ఒంటరి పక్షి ఆ ముసలావిడ ఇంకా నిద్ర లేచినట్లు లేదు. పై వాటా నిశ్శబ్దంగా ఉంది.

సరోజ తమ బాత్‌రూమ్‌లోకి నడిచి, మళ్ళీ మంచంమీద వాలింది. అయిదు నిమిషాలు కాకుండానే సరోజ గాఢనిద్రలోకి చేరుకొంది.

❖ ❖ ❖

కాలింగ్ బెల్ మోగుతున్న చప్పుడుకు సరోజకు మెలకువ వచ్చింది. మంచంపై నుండే గోడగడియారం అప్పుడు ఎనిమిదిన్నర అయిందని చెప్తోంది. అంటే మోటార్ కాలుతున్న వాసనకు నిద్రలేచిన తను మళ్ళీ పడుకొని అప్పుడే మూడున్నర గంటలయిందన్నమాట!

'ఈ సమయంలో ఎవరో!' అనుకుంటూ సరోజ వెళ్ళి తలుపు తీసింది. 'టెలిగ్రామ్, మీ పై వాటాకు!' అంటూ అందించాడు ఆ వ్యక్తి అతను అందించిన కాగితం మీద సంతకం చేసి తిరిగి ఇచ్చేసింది. పైవాటాలో ఉండేది ఆవిడ ఒక్కతే గనుక, ఎవర్నీ, పైకి వెళ్ళనీయరు, రోజులు అసలే బాగలేవు. ఎన్ని రకాల కథలు వినటం లేదు గనుక! ఆస్తి కోసమో, నగల కోసమో, ఆఫ్టరాల్ ఓ అరవై డెబ్బయ్ రూపాయలకోసమో కూడా ఒంటరి ఆడవాళ్ళను హత్య చేస్తున్న ప్రబుద్ధులుండే కాలమిది! అందుకే ముందు జాగ్రత్త కోసం, ఎవర్నీ మెట్లెక్కినీయరు వీళ్ళు.

టెలిగ్రామ్ చేత్తో పట్టుకొని మెట్లెక్కి ఆ ముసలావిడ వాటా తలుపు హేండిల్ మీద చెయ్యి వేసింది సరోజ.

షాక్ కొట్టినట్లయి చెయ్యి వెనక్కు తీసుకొంది వెంటనే! ఊహించలేనంత వేడిగా ఉంది ఆ తలుపు హేండిల్. ఏం జరిగిందో అర్థంకాక, కెవ్వున కేకేసింది. దారినబోయే వాళ్లెవరో ఇద్దరు పరిగెట్టుకొచ్చారు. జరిగింది వాళ్ళకు చెప్పింది సరోజ.

వాళ్లూ చేతులు కాల్చుకొని 'ఎందుకైనా మంచిది, పోలీసుల్ని పిలిపించండి' అని ఓ ఉచిత సలహా పడేసి వెళ్ళిపోయారు.

సరోజ మెట్లు దిగి ఇంట్లోకి వచ్చి ముందుగా ఆమె భర్త రామ్మోహన్‌కు ఫోన్ చేసి జరిగిందంతా చెప్పింది. ఆ తర్వాత, అతను చెప్పినట్లుగానే పోలీసులకూ ఫోన్ చేసింది.

పావుగంట గడిచేసరికి పోలీసులు రానే వచ్చారు. హేండిల్ ఇంకా వేడిగా కాలుతుండటాన్ని వాళ్ళూ గమనించారు. ఆ తర్వాత కొన్నిసార్లు తలుపులు బాది, చివరికి తలుపు విరగ్గొట్టారు.

లోపల్నించి వేడిగా గాలి, బయటకు వచ్చి వాళ్ళను ఉక్కిరిబిక్కిరి చేసింది. అది సర్దుకొన్నాక, నెమ్మదిగా లోపలికి అడుగు పెట్టారు. లోపలి దృశ్యం వాళ్ళను నిర్ఘాంతపరిచింది.

గది మధ్యలో నేలమీద ఓ చాప, దానిమీద చిన్న పరుపు, ఓ దిండూ ఉన్నాయి. పరుపు మధ్యలో చితిమీద కాలిన శవంలా కొంత బూడిద, ఆ బూడిదలో కొన్ని అస్థికలు, ఎవరో పూర్తిగా సంకోచింపజేసినట్లుగా చిన్న సైజు పుర్రె...

ఇన్‌స్పెక్టర్ అరవింద్‌కు ఇలాంటి కేసులు కొత్తేమీకాదు. అతని ఇరవై ఏళ్ళసర్వీసులో ఇలాంటి కేసులు అనేకం.. అయినా ఈ కేసు చిత్రంగా అనిపిస్తోంది! పరుపుమీద ఆ ముసలావిడ పేరు రాజేశ్వరమ్మ. తండ్రిపేరు తెలీదు. వయసు అరవై అయిదుకు పైబడే,ఎడ్రస్ ఫలానా, ఒంటరిగానే ఉంటోంది. దూరంగా ఉండే కొడుకు ప్రతినెలా పంపించే డబ్బే జీవనాధారం.. ఆ రాజేశ్వరమ్మ పరుపుమీద పడుకొన్నంతమేర మాత్రమే కాలి ఉండి, మిగిలిన పరుపు, చాపా మామూలుగాఉంది! రాజేశ్వరమ్మ ఆత్మహత్య చేసుకొన్నా, ఆమెను ఎవరైనా హత్యచేసి ఉన్నా, ఇలా జరిగి ఉండే వీలే లేదు.

అరవింద్ ఒకసారి గదంతా కలియజూశాడు. గదిలో ఎక్కడా ఏదీ కాలిన సూచనలు లేవు, గది గోడలు సుమారుగా నేలమీద నుంచి నాలుగడుగుల ఎత్తుపై నుంచి, అంతా మసిబారి ఉన్నాయి. పైకప్పు కూడా పొగచూరి ఉంది. రాజేశ్వరమ్మ పడుకొన్న పరుపు దగ్గరలోనే న్యూస్ పేపర్ల కట్ట ఒకటి ఉన్నా అవీ కాలిపోలేదు. గదిలో కొంచెం దూరంగా ఓ డ్రెస్సింగ్ టేబుల్. దాని దగ్గరే నిలువుటద్దం, అది మాత్రం పగిలి, బీటలు వారింది. బహుశా గదిలోని మంటలకో వేడికో అయి ఉండొచ్చు! గదిలో ఓ గోడమీదున్న గడియారం 4.42 దగ్గర ఆగిపోయి ఉంది.

రాజేశ్వరమ్మది ఆత్మహత్య అయి ఉంటే ఆత్మహత్య చేసుకోవటానికి ఆమె ఉపయోగించిన కిర్సనాయిల్, పెట్రోల్ వగైరాలేవైనా, ఆ డబ్బాలు గదిలో ఉండి ఉండాలి. అవేవీ లేవు! పైగా వాటిని ఒంటిపై ఒంపుకొన్నప్పుడు, ఆ ద్రవం ఇంట్లోని వస్తువులమీద పడి, అవీ ఆ తర్వాత కాలిపోయి ఉండాలి. అదీ జరగలేదు!!

పోనీ, ఆమెను ఎవరైనా హత్యచేసి ఉంటారా అంటే అంత ఖచ్చితంగా, కేవలం ఆమె ఒంటిమీద మాత్రమే ఆ ద్రవాలు పడేలా ఎవ్వరూ పొయ్యలేరనేది ఖాయం. పైగా నిద్రపోతున్న మనిషిమీద ఎలాంటి ఇంధనాన్ని పోసినా, పోసినప్పుడే వాళ్ళకు మెలుకువ రావటం సహజం. మరీ మొద్దు నిద్రపోతున్నా అగ్గిపుల్ల గీసి అంటించినప్పుడైనా మెలుకువ వచ్చేస్తుంది. మంటల్ని ఆర్పుకొనే ప్రయత్నాలనూ చేస్తారు! రాజేశ్వరమ్మ విషయంలో అలాంటి ఛాయలూ లేవు!!

కేసంతా చాలా విచిత్రంగా అనిపించి, అరవింద్ అక్కడనుంచే క్రైమ్ బ్రాంచ్‌కు ఫోన్ చేశాడు.

మరో అరగంటకు క్రైమ్ బ్రాంచ్ టీమ్, ఫోరెన్సిక్ సైన్స్ నిపుణుల బృందం అక్కడికి చేరుకొన్నాయి. సాధారణమైన చావుకాదిది అన్న దొక్కటే వాళ్ళందరి అభిప్రాయం అయింది.

చాప, పరుపు, దిండ్ల మీద మిగిలిన అవశేషాల్ని, అస్థికల్ని జాగ్రత్తగా పోగుచేసి పోస్ట్‌మార్టమ్‌కు పంపించారు. అసలు శవమే లేనప్పుడు శవపరీక్ష ఏమిటి? అనీ అనుకొన్నారు. గది అంతా వెతికినా ఎక్కడా వేలిముద్రల ఛాయలే కానరాకపోవటం మరీ విచిత్రం అనీ

అనుకొన్నారు. రెండో రోజుకు పోస్ట్‌మార్టమ్ రిపోర్టు రానే వచ్చింది. బతికి ఉన్నప్పుడు బాగా ఆరోగ్యంగానే ఉన్న రాజేశ్వరమ్మ, చివరిగా నాలుగైదు కిలోల బరువున్న బూడిద మూటలో మిగలటం పోస్ట్‌మార్టమ్ చేసిన నిపుణులకూ ఆశ్చర్యం అనిపించింది. మిగిలిన అస్థికల్ని పరీక్షిస్తే ఆమెకు నిప్పంటించటానికి, నిప్పంటించిన వారెవరైనా ఉంటే ఎలాంటి రసాయనాలను వాడిన ఆనవాళ్ళూ లేవని తేలింది. 'రాజేశ్వరమ్మది సాధారణమైన మరణం కాదు. అసాధారణమైన అగ్ని ప్రమాదం వల్ల ఆమె మరణం సంభవించినా, ఆ అగ్ని ప్రమాదానికి కారణాలు స్పష్టం కావటం లేదు' అని పోస్ట్‌మార్టమ్ నివేదిక పేర్కొంది.

'ఇది ఖచ్చితంగా చేతబడే అయి ఉంటుందండీ...' అంది సరోజ రామ్మోహన్‌తో..

'అర్థం లేకుండా మాట్లాడకు! రాజేశ్వరమ్మ గారికి ఒక్కడే కొడుకు. ఆస్తి అంతా ఆమె కొడుకు పేరమీదే రాసిచ్చేసింది. కాబట్టి ఆస్తికోసం ఆమె మీద చేతబడిచేసే వాళ్లు, చేయించేవాళ్ళూ ఎప్పుడూ ఉండరు' అన్నాడు రామ్మోహన్.

'కాదండీ, ఆమె కోడలు చేయించి ఉండొచ్చుగదా!'

'ఎందుకు చేయించి ఉండాలి, మోటివ్ అనేది ఒకటి ఉండాలి కదా, ఆలోచించు...

సరోజ ఆలోచించలేదు.

'నెలనెలా రాజేశ్వరమ్మగారికి డబ్బు పంపిస్తుంటాడు గదా, రాజేశ్వరమ్మగారు పోతే ఆ అవసరం ఉండదు గదా!'

'నాన్సెన్స్! ఎంత పంపిస్తాడు నెలనెలా! మహా అయితే అయిదొందలు, అంతేకదా ఆ మాత్రానికే ప్రాణాలు తీస్తారంటావా?'

'ఏమో అయినా, ఆవిడ మళ్ళీ ఎప్పుడైనా తననెత్తిమీదకు వచ్చి పడుతుందేమోనన్న భయంతో కూడా ఆ కోడలు చేతబడి చేయించి ఉండొచ్చు...' అంది సరోజ.

రామ్మోహన్ భార్యకేసి ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు ఒక్కటి చెప్పు సరోజా! ఒకవేళ నువ్వే ఆ కోడలి స్థానంలో ఉంటే చేతబడి చేయించేదానివా?'

'నా సంగతి వేరు... నాకలాంటి విషపుబుద్ధులు లేవు. ఉండవ్...' ఖరాకండిగా అంది సరోజ.

రామ్మోహన్ నవ్వేశాడు. 'నీకే కాదు, నూటికి తొంభై తొమ్మిది మందిలో అల్లాంటి బుద్ధులు ఉండవ్! అనవసరంగా ఆ కోడల్ని ఆడిపోసుకోకు' అన్నాడు.

సర్లెండి, ఆత్మహత్యాకాదు హత్యాకాదు! అయినా మనిషి చచ్చిపోయింది. కారణం సెలవిస్తారా మరి?' అంది వ్యంగ్యంగా సరోజ.

❖ ❖ ❖

'కారణం చెప్పటం చాలా కష్టంగానే ఉంది. కాదు కాదు.. అసాధ్యంగానే ఉంది'. అన్నాడు బర్న్స్ ఎక్స్‌పర్ట్ పరశురామ్, అరవింద్ చెప్పినదంతా విని కేసు ఫైలునంతా తిరగేసి చూసి కూడా అదే అన్నాడు.

'ఓ మనిషి హఠాత్తుగా మరణించటంలో వింతేమీ లేదు. ఉయ్యాల్లో బిడ్డ ఆడుతూ పాడుతూనే కన్ను మూసేస్తే కాట్‌డెత్ సిండ్రోమ్ అంటున్నాం. నడుస్తున్న వ్యక్తి ఉన్నట్లుండి బాల్చీ తన్నేస్తే హార్ట్ఎటాక్ అనేస్తాం. ఎవరెలా చచ్చిపోయినా, దానికో కారణం, చావు తర్వాత ఓ శరీరం ఉండి తీరుతాయి కానీ రాజేశ్వరమ్మ కేసులో కారణమూ కనిపించటం లేదు, మనిషి శరీరమూ మిగిలిలేదు' అన్నాడు పరశురామ్.

'అంతేకాదు, ఓ మనిషి శవం కాలి బూడిద కావాలంటే, ఎంత లేదన్నా 3000 డిగ్రీల ఫారెన్‌హీట్ ఉష్ణోగ్రత ఉండాలి. అంత వేడి ఉండి ఉంటే కానీ ఎముకలు కాలవ్... అంత వేడి ఉండి ఉంటే ఇల్లంతా కూడా బూడిద కుప్ప అయిపోయి ఉండాలి. అదీలేదు! అసలు ఆవిడ పడుకున్న పరుపే పూర్తిగా కాలకపోవటం చాలా ఆశ్చర్యం అనిపిస్తోంది....' అంటూ, ఆగి క్షణం తర్వాత 'ఇది ఏ ఉరుమో, మెరుపు వల్లో జరిగింది కావచ్చు కదా!' అన్నాడు అరవింద్.

కాదన్నట్లు అడ్డంగా తల ఊపాడు పరశురామ్. 'ఒకటి మెరుపు వచ్చి ఉంటేనో, పిడుగు పడి ఉంటేనో ఆ ఇంటి కప్పుకు కూడా పెద్ద రంధ్రం అయి ఉండాలి. అదేమీ లేదు కదా! అయినా ఆ రోజున ఎక్కడా మెరుపులు మెరిసినట్లు పిడుగులు పడ్డట్లుకానీ వార్తలు రాలేదు' అన్నాడు పరశురామ్.

'పోనీ ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్...?'

'అదీ కాదు, నువ్వే చెప్తున్నావ్ గదా, కాలింగ్‌బెల్ మోతకే ఆ ఇంటి ఓనర్ భార్య నిద్రలేచిందని... షార్ట్ సర్క్యూట్ అయి ఉంటే ఆ ఇంట్లో ఫ్యూజ్‌పోయి ఉండేదిగదా!'

నిజమే ఇదీ కారణం కాదనిపిస్తోంది. ఒప్పుకొన్నాడు అరవింద్.

'నా సంగతి నీకు తెలుసు అరవింద్! నేను బర్న్స్ స్పెషలిష్టును. ఒంటిమీద కాలిన గుర్తుల్ని బట్టి, మచ్చల్ని బట్టి కాల్పులకు కారణం చెప్పగలను కానీ రాజేశ్వరమ్మ కేసులో అసలు శరీరమే లేదు గదా! ఇంకా కారణాల గురించి నేనేం చెప్పగలను?' అన్నాడు పరశురామ్.

'నిజమేలే పరుపుమీద కాలిన బూడిద, బూడిద మధ్యలో కొన్ని బొమికెలు, ఓ చిన్న పుర్రె...' అరవింద్‌ను కట్‌చేస్తూ అన్నాడు పరుశురామ్ 'అవును, నువ్వు చెప్తోంటే గుర్తొస్తోంది. ఆ పుర్రె ఒకటి మిగిలి ఉందిగదా అదీ ఓ విచిత్రమే! మామూలు అగ్ని ప్రమాదం కేసుల్లో అయితే ఏ పుర్రె పూర్తిగా కాలిపోదు. శవదహనం జరిగేటప్పుడు ఆ అతి తీవ్రమైన ఉష్ణోగ్రతకు పుర్రె బద్దలవుతుంది, ముక్క చెక్కలవుతుంది. అంతేగానీ ఇదేదో ఓ పద్ధతి ప్రకారం అన్ని వైపుల నుంచీ ఒకేలా సంకోచం కావటమంటూ ఎక్కడా జరగదు. కానీ రాజేశ్వరమ్మ కేసులో అలాగే జరిగింది. ఎలా చూసినా ఇదంతా విచిత్రమే!' అన్నాడు పరశురామ్.

'ఇంకో కోణంలోంచి చూడు, ఏమైనా ఫలితం ఉంటుందేమో!' అన్నాడు అరవింద్.

'నిక్కచ్చిగా చెప్తున్నా! నాకు ఇంకో కోణమేదీ, తోచటంలేదు. ఎలా ఆలోచించినా అర్థంకాని కేసు ఇది. ఒప్పుకొంటున్నా గదా నేను జీవితంలో అర్థం చేసుకోలేకపోయిన

మొదటికేసు. ఇది. నాచేత కావటంలేదు. అయామ్‌ఏ ఫెయిల్యూర్ ఇన్‌దిస్ కేస్! అయామ్ సారీ!' అన్నాడు పరశురామ్.

'మరి ఏం చేద్దామంటావ్! ఏ కేసూ ఇలా ఓ కొలిక్కి తేకుండా వదలటం నా పద్ధతి కాదు..' అన్నాడు అరవింద్.

పరశురామ్ చిన్నగా నవ్వాడు: 'మనకు తెలీనివీ, మనకు అర్థంగాని మిస్టరీలు ఎన్నో ఉన్నాయి ఈ ప్రపంచంలో!! నాకు తెలిసిన ఒకాయన మెడికల్ హిస్టరీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన్ను సంప్రదించి చూద్దాం. ఏంమైనా చెప్తారేమో!!'

'సరే, పద మరి!' అన్నాడు అరవింద్.

❖ ❖ ❖

'మెడికల్ హిస్టరీ అనో, జనరల్ హిస్టరీ అనో పేరు పెట్టద్దుగానీ, ఇలాంటివి చరిత్రలో అనేకంగా జరగాయనేది వాస్తవం. దీన్ని స్పాంటెనియస్ హ్యూమన్ కంబశ్చన్ అంటారు. దీన్ని మెడికల్ సైన్స్‌లోని కొందరు ఒప్పుకోరు. ఆ మాటకొస్తే ఇరవయ్యో శతాబ్దం సైన్స్ కూడా దీన్ని ఒప్పుకోదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించిన వ్యాధుల్లో కూడా ఇలాంటిది కానరాదు. కంటికి కానవస్తున్న దాన్ని కాదనలేం కాబట్టి, ఎవ్వరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా, ఇలాంటి కేసులు ఉంటున్నాయనేది నిజం. ఎందరెందరో ఎన్నెన్నో కారణాలను ప్రతిపాదించారు. జీర్ణవ్యవస్థలో భాగంగా శరీరంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ల దగ్గర్నుంచి ఒంట్లో మెరుపులు, పిడుగులు, ఆఖరికి శరీరంలో ఉండే అణువుల విచ్ఛేదనం వరకు సవాలక్ష మంది సవాలక్షకారణాలను చెప్పారు. అవేవీ కాదని అనేవారూ ఉన్నారు. ఒంటిలో ఉండే ఆయిల్స్‌వల్ల, ఫాస్ఫరస్‌వల్ల కూడా ఇలాంటి మరణాలు వస్తాయంటారు. అసలు కారణం ఎవరికీ తెలియదు. అంతే..' అన్నారు ప్రొఫెసర్ సుబ్బరామన్.

'కారణం ఏదైనా కానీయండి సార్... కేవలం శరీరం మాత్రం కాలిపోయి చుట్టుపక్కల ఏమీ కాలకపోవటం, మంటలు రాకపోవటం, శరీరం కాలుతున్న వాసనలు ఎవ్వరూ గుర్తించకపోవటం... ఇవన్నీ ఎలా ఎక్స్‌ప్లెయిన్ చెయ్యటం...' అంటూ ఆగాడు అరవింద్.

'ఇంగ్లీష్‌లో ఓ లోకోక్తి మీరు వినే ఉంటారు! ట్రూత్ ఈస్ స్ట్రేంజర్ దేన్ ఫిక్షన్ అని! ఇదీ అంతే!! కొన్ని వాస్తవాలు, కల్పనలకన్నా విచిత్రం! ఇంతకు మించి మరో విధంగా వ్యాఖ్యానించలేం వీటిని!' అన్నారు సుబ్బరామన్.

ఆయన ఆ మాటపైకి అన్నారు గానీ, నిజానికి ఆ కేసు విన్న అందరు అనుకొన్నదీ అదే!!

– దిక్సూచి, ఏప్రిల్ 2000